# బ్రహ్మాస్త్రం సంధించండి

## పోచారం, షిండేపై కేసీఆర్ ప్రశంసలు...

బాన్సువాడ, జుక్కల్ ప్రజా ఆశీర్వాద సభల్లో పోచారం శ్రీనివాస రెడ్డి, హన్మంత్ షిండేలను సీఎం కేసీఆర్ ప్రశంసించారు. తన నియోజకవర్గంలో కూడా కట్టని విధంగా బాన్సువాడలో 11వేల డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించిన ఘనత పోచారంకే దక్కుతుందన్నారు. ఎన్ని పదవులు అనుభవించినా, ఏ హోదాలో ఉన్నా పోచారం మాత్రం రుబాబు చేసే వ్యక్తి కాదని కేసీఆర్ అన్నారు. సౌమ్యుడిగా పేరొందిన షిండేకు భారీ మెజార్టీతో ప్రజలంతా మరోసారి పట్టం కట్టాలని కోరారు.



బాన్సువాడ సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్ చిత్రంలో స్పీకర్ పోచారం, డీసీసీబీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి

- ప్రజలకు మేలు చేసేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..
- హింసా రాజకీయాలకు చరమగీతం పాడండి
- బాన్సువాడను బంగారువాడగా కీర్తించిన కేసీఆర్
- వెనుకబడ్డ జుక్కల్ ప్రాంతం ఇప్పుడు బాగుపడ్డది
- జుక్కల్, బాన్సువాడ సభల్లో బీఆర్ఎస్ అధినేత
- 2 గంటల పాటు సీఎం కేసీఆర్ సుడిగాలి పర్యటన

నిజామాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా బ్రహ్మాస్త్రాన్ని సంధించాలంటూ భారత రాష్ట్ర సమితి అధినేత, సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. మంచోళ్లు ఎవరో, చెడ్డోళ్లు ఎవరో గుర్తించి ఆలోచించి ఓటెయ్యాలని కోరారు. కారు చీకట్లను, సాగు నీటి ఇబ్బందులను, తాగు నీటి ఇక్కట్లను, వలసలతో కూడుకున్న తెలంగాణను పదేండ్ల కాలంలో బాగు చేసుకున్నామని కేసీఆర్ గుర్తు చేశారు. రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితుల నుంచి తలెత్తుకుని నిలబడేలా చేశామని చెప్పారు. ప్రజా ఆశీర్వాద సభల్లో భాగంగా జుక్కల్, బాన్సువాడలో సోమవారం నిర్వహించిన కార్యక్రమాలకు సీఎం కేసీఆర్ హాజరయ్యారు. హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో వచ్చిన ఆయన మొదట జుక్కల్ చౌరస్తాలో జరిగిన సభకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్యే హన్మంత్ షిండేతో కలిసి హాజరై ప్రసంగించారు. అనంతరం హెలీకాప్టర్‌లోనే బాన్సువాడకు చేరుకొని స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి, మంత్రి ప్రశాంత్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. సభలో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఆవశ్యకతను కేసీఆర్ వివరించారు. ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అసత్య ప్రచారాలపై బలమైన వాగ్బాణా లను సంధించారు. ఎంపీ కొత్తా ప్రభాకర్ రెడ్డిపై జరిగిన దాడిని కేసీఆర్‌పై దాడిగానే భావిస్తున్నట్లుగా ప్రకటించడంతో పాటుగా హింసాత్మక చర్యను తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలకు ఎన్నికల్లో గెలిచే అవకాశాలు లేకపోవడంతోనే ఇలాంటి దుష్ట సంప్రదాయానికి తెరలేపాయని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీకి చేతకాదా? చేతులు లేవా? మేము తిరబడితే దుమ్ము రేగాలే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**లక్ష మెజార్టీ రావాలి..**

బాన్సువాడ నియోజకవర్గం నుంచి పోచారం శ్రీనివాస రెడ్డికి ఈ ఎన్నికల్లో లక్ష మెజార్టీ తథ్యమని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజలంతా స్పీకర్‌ను మంచి మెజార్టీతో గెలిపిస్తే వచ్చే ప్రభుత్వంలో పెద్ద పదవిలోనే పోచారం శ్రీనివాస రెడ్డి కొనసాగుతారని హామీ ఇచ్చారు. వ్యవసాయ మంత్రిగా రైతుల కోసం చేపట్టిన అనేక కార్యక్రమాల్లో పోచారం పాత్ర ఉన్నదని, అందువల్లే అవన్నీ విజయవంతం అయ్యాయని కేసీఆర్ పేర్కొన్నారు. అందుకే లక్ష్మీపుత్రుడని పేరు పెట్టినట్లుగా మరోసారి కేసీఆర్ గుర్తు చేశారు. బాన్సువాడను బంగారువాడగా పోచారం మార్చారని కేసీఆర్ చెప్పారు.

**స్వరాష్ట్రంలో జుక్కల్‌లో అద్భుత ప్రగతి**

ఉద్యమ సమయంలో మద్నూర్, నిజాంసాగర్ ప్రాజెక్టు వచ్చి మీటింగ్‌లు పెట్టుకున్న సందర్భాలు తనకు గుర్తుకు ఉన్నాయని కేసీఆర్ చెప్పారు. జుక్కల్ వెనుకబడ్డ ప్రాంతమని తెలంగాణలో అద్భుతంగా ప్రగతి సాధ్యమైందన్నారు. ప్రజల పన్నులతో వచ్చే ఆదాయాన్ని రైతుబంధు రూపంలో కేసీఆర్ దుబారా చేస్తున్నారంటూ మాజీ పీసీసీ చీఫ్, ప్రస్తుత పీసీసీ చీఫ్ చేస్తున్న ప్రచారాన్ని ప్రజల ముందుకు కేసీఆర్ తీసుకువచ్చారు. రైతుబంధు ఉండల్నా? వద్దా? అంటూ అడిగారు. ప్రజలంతా ఉండాలి... అంటూ గట్టిగా జవాబిచ్చారు. రైతు బంధు దుబారా అంటూ వ్యాఖ్యానించిన కాంగ్రెస్ పార్టీని బంగాళాఖాతంలో కలపాలని పిలుపునిచ్చారు. దేశంలో రైతుబంధు పదాన్ని పుట్టించిందే బీఆర్ఎస్ ప్రభుత్వమని కేసీఆర్ అన్నారు. ఎన్నికల అనంతరం స్వయంగా జుక్కల్‌కు వచ్చి లెండి కాలువలు పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపుతానని హామీ ఇచ్చారు. బాన్సువాడ సభలో ఎంపీ బీబీపాటిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పోచారం సురేందర్ రెడ్డి, డా.పోచారం రవీందర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అంజి రెడ్డి, స్పీకర్ సతీమణి పుష్పమ్మ, కుటుంబ సభ్యులు సోనిరెడ్డి, అరుణారెడ్డి, వెంకట్రాంరెడ్డి తదితరులు హాజరయ్యారు. జుక్కల్ సభలో మంత్రి, ఎంపీతో పాటుగా జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ, రాష్ట్ర నాయకుడు దఫేదార్ రాజు పాల్గొన్నారు.

## రైతు పక్షపాతి సీఎం కేసీఆర్

- ప్రతిపక్షాల డిపాజిట్లు గల్లంతు చేయాలి
- ఆశీర్వదిస్తే రెట్టింపు సేవ చేస్తా
- స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి



బాన్సువాడ/కోటగిరి, అక్టోబర్ 30 : ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల పక్షపాతి అని రాష్ట్ర శాసనసభాపతి పోచారం శ్రీనివాస రెడ్డి కొనియాడారు. బాన్సువాడ పట్టణం ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్షాల డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమన్నారు. బాన్సువాడలో పోటీ చేసేందుకు ప్రతిపక్షాలకు అభ్యర్థులు కరువయ్యారని, పనిచేసే వారిపై నిందలు వేస్తున్నారని స్పీకర్ ఆరోపించారు. సీఎం కేసీఆర్ సహకారంతో 10వేల కోట్లతో అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. చేతకాని ప్రతిపక్ష నాయకులు కొంతమంది ఒకరికి ఓటేస్తే ముగ్గురు ఎమ్మెల్యేలని అసత్య ప్రచారాలు చేస్తున్నారని.. కానీ వాస్తవంగా ప్రజలు ఒక్కరికి ఓటు వేసి గెలిపిస్తే ముగ్గురం కూలీలుగా సేవలందిస్తున్నామన్నారు. రాను న్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదిస్తే రెట్టింపు ఉత్సాహంతో సేవలు అందిస్తానన్నారు. నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేశానని ఇందులో 10వేలకు పైగా గృహ ప్రవేశాలు జరిగాయన్నారు.

దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నారని, సాగు నీటి కొరత లేకుండా చేశాన్నారు. కేసీఆర్ ప్రత్యేక సహకారంతో మల్లన్న సాగర్ కాలువ నుంచి నిజాంసాగర్‌కు సాగునీరు తెచ్చేందుకు రూ.1500 కోట్లు నిధులు మంజూరు చేయడంతో నిజాంసాగర్ నిండు కుండలా మారి రైతాంగానికి రెండు పంటలకు సాగునీరందుతుందన్నారు. తన జీవితంలో ఎంతో మంది నాయకులను, ముఖ్యమంత్రులను చూశానని పేదలు, రైతుల కోసం అనునిత్యం పనిచేసే సీఎం కేసీఆర్‌లాంటి వ్యక్తిని ఒక్కరినే చూశానని అన్నారు. నియోజకవర్గాన్ని ఇంత పెద్ద మొత్తంలో అభివృద్ధి చేశానంటే సీఎం కేసీఆర్ దయతోనేనని ప్రజలు అడిగిన ప్రతి పనులు చేసి పెట్టానని ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల పక్షాన కేసీఆర్‌కు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**ఆశీర్వదించండి సేవలందిస్తాం : డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి**

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా బాన్సువాడ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ ప్రత్యేక సహకారంతో అభివృద్ధి చేశారని, రానున్న ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు పోచారం సీనన్నను ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## పదేండ్లలో ఎంతో అభివృద్ధి

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే



నిజాంసాగర్, అక్టోబర్ 30 : జుక్కల్ నియోజకవర్గంలో గడిచిన పది సంవత్సరాల కాలంలో సంక్షే మం, అభివృద్ధి కోసం మన కేసీఆర్ ప్రభుత్వం రూ.5500 కోట్లు వెచ్చించిందని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. జుక్కల్ చౌరస్తాలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయ న మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో జుక్కల్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయనున్న నాగమడుగు మత్తడి నిర్మాణ పనులు పురోగతిలో ఉందన్నారు. నియోజకవర్గంలో మూడు 30 పడకల దవాఖానలు, ఒక వంద పడకల దవాఖాన మంజూరు చేసుకున్నామని వివరించారు. 65సంవత్సరాల్లో జరగని అభివృద్ధి మనం పది సంవత్సరాల్లో చేసి చూపించామన్నారు. వంద గ్రామాలకు రోడ్లు సరిగ్గా లేకపోవడంతో రవాణా వ్యవస్థ సక్రమంగా లేకుండా ఉండేదని అలాంటి రోజుల నుంచి నేడు అన్ని గ్రామాల్లో బీటీ రోడ్లు వేసుకున్నామని గుర్తు చేశారు. మరో మారు అధికారంలోకి వచ్చాక పిట్లంలో డిగ్రీ కళాశాల, నిజాంసాగర్, కౌలాస్‌కోట, కౌలాస్‌నాలా ప్రాజెక్టును పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, రామలింగేశ్వర ఆలయాన్ని బాగు చేసుకోవాలని, సలాబత్‌పూర్ ఆలయంలో ప్రస్తుతం రూ.6.70 కోట్లతో పనులు కొనసాగుతున్నాయని ఆలయాన్ని కూడా బాగు చేయాలని సీఎం కేసీఆర్‌ను కోరారు. మరో మారు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని అన్నారు. సభల్లో క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, నిజామాబాద్ జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మహారాష్ట్ర మాజీ ఎమ్మెల్యే శంకరన్న దొండెగే, బాన్సువాడ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సహకార సంఘం అధ్యక్షుడు క్రిష్ణారెడ్డి, జిల్లా బంజారా సంఘం అధ్యక్షుడు బద్యానాయక్, మోహన్ నాయక్, సంగ్రాం నాయక్, మైనారిటీ నాయకులు మహ్మద్ ఎజాజ్, వాహబ్, మీరా, ఎంఐఎం నాయకులు సయ్యద్ ఖాన్, ఎంపీపీ దొడ్ల నీరజా వెంకట్రాం రెడ్డి, జడ్పీటీసీ పద్మా గోపాల్ రెడ్డి, పిట్ల శ్రీధర్, ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.



బాన్సువాడ సభకు తరలివస్తున్న జనం

## సీఎం సభలు గ్రాండ్ సక్సెస్

కామారెడ్డి జిల్లా బాన్సువాడ, జుక్కల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. సభా ప్రాంగణాలు జనసంద్రాన్ని తలపించాయి. గులాబీ జెండాలు చేతబూని వేలాదిగా తరలివచ్చిన జనంతో సభా ప్రాంగణాలు గులాబీ వనాన్ని తలపించాయి. సీఎం కేసీఆర్ ప్రసంగానికి జనం ఈలలు, చప్పట్లతో జేజేలు పలికారు. భారీగా తరలివచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. సభలు విజయవంతం కావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొన్నది.



ప్లకార్డులతో సభకు హాజరైన యువకులు